
సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం ၊ 19 ၊ అక్టోబర్ ၊ 2024



జనావాసాల మధ్య మద్యం దుకాణాలు

రైల్వేకోడూరు మండలంలో మద్యం దుకాణాలు జనావాసాల మధ్యే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. -8లో



అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం

అమరులైన పోలీస్ కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.520	రూ.600
రెండోరకం	రూ.380	రూ.500



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 129 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	300	300
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 6.460 కిలోలు

న్యూస్‌రీల్

టోల్ లీజు అప్పగింత

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వచ్చే సందర్శకుల నుంచి వసూలు చేసే ఎంట్రీఫీజు వేలం పాటదారుకు శుక్రవారం ఏడాది లీజుకు అప్పగించారు. మదనపల్లెకు చెందిన వ్యక్తి రూ.45.20 లక్షలకు వేలంపాట దక్కించుకోగా నిర్వహించుకోలేనని చెప్పడంతో సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. తర్వాత జరిగిన పరిణామాలతో పాటపాడిన మేరకు లీజును తీసుకునేందుకు అంగీకరించడంతో అప్పగించారు. దీనితో శుక్రవారం నుంచి ఎంట్రీఫీజు వసూలుకు రెవెన్యూ అధికారులు ప్రయివేటుకు అప్పగించారు.

ఉర్దూ యూనివర్సిటీలో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

వైవీయూ: కర్నూలు నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సుల్లో కనీ్వనర్ కోటా కింద పరిమిత సంఖ్యలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వి.లోకనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయంలో ఎం.ఎ.ఇంగ్లిష్, ఎం.ఎ.ఎకనామిక్స్, ఎం.ఎ.ఉర్దూ, ఎం.ఎస్.సి కంప్యూటర్ సైన్స్, ఎం.ఎస్.సి బోటని, ఎం.ఎస్.సి జువాలజీ, ఎం.ఎస్.సి ఇండస్ట్రియల్ కెమిస్ట్రీలో విద్యార్థులను స్పాట్ అడ్మిషన్ కింద చేర్చుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ కార్యాలయంలో హాజరై ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. బాలికలకు యూనివర్సిటీలో హాస్టల్ వసతి కల్పిస్తున్నామని, అలాగే బాలురకు నగరంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో వసతి సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు నగరంలోని నలుమూలల నుంచి వచ్చే విద్యార్థులకు యూనివర్సిటీ బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు : 8341511632, 9959758609 సంప్రదించవచ్చని వివరించారు.

10 నుంచి అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్

రాయచోటి (జగదాంబసెంటర్): కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) మైదానంలో నవంబర్ 10 నుంచి 15వ తేదీ వరకు అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా అధికార యంత్రాంగం తెలిపింది. గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ర్యాలీలో కర్నూలు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్‌మెన్ తదితర పోస్టులకు ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాయిన్‌ఇండియన్‌ఆర్మీ.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందవచ్చని వివరించారు. ఎంపికల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తారని, ఎలాంటి దళారులు, ఏజెంట్లు, మోసగాళ్ల మాటలు నమ్మవద్దని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు రావాలి



కలకడ ఆదర్శ పాఠశాలను తనిఖీ చేస్తున్న జిల్లా విద్యా శాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి

కలకడ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కలకడ ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు హాజరై డిశంబర్ నాటికి 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు పూర్తి చేసి రివిజన్ చేయాలని ఆదేశించారు. బాలికలకు కేటాయించిన హాస్టల్ నిర్మాణం పూర్తి కాలేదని ఆ పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్‌నాయుడు తెలపగా వెంటనే నిధుల విడుదలకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి పాఠ్యాంశాల బోధన పూర్తి చేసిన ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ.. మకిలి!

- వైద్య ఆరోగ్య శాఖను వెంటాడుతున్న ప్రైవేటు కళాశాలల సర్టిఫికెట్ల వ్యవహారం
- ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల నుంచి పొందిన సర్టిఫికెట్లతో ఉద్యోగాలు
- బోగస్ సర్టిఫికెట్ల వల్లే కొలువు కోల్పోయామంటున్న బాధితులు
- ఈ నెల 25న లోకాయుక్త విచారణకు ఉన్నతాధికారులు
- నాటి చంద్రబాబు హయాం నుంచి అదే ధోరణి
- ఆవేదనలో బాధితులు

సాక్షి ప్రతినిధి, కడప: వైద్య ఆరోగ్యశాఖను నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెంటాడుతోంది. 'అర్హులమైన మేము కాంట్రాక్టు బేసిస్ పైన, అనర్హులు రెగ్యులర్ పోస్టుల్లో కొనసాగుతున్నారు. నాటి చంద్రబాబు ప్రభుత్వ ఫలితం కారణంగా నేటికీ ఆవేదనలో ఉన్నాం' అని బాధితులు వాపోతున్నారు. గుర్తింపు లేని కళాశాలలు జారీ చేసిన సర్టిఫికెట్లకు అభ్యంతరం చెప్పాల్సిన యంత్రాంగం చెప్పలేదు. కొందరు అవినీతి అధికారుల కారణంగా యథేచ్ఛగా ఉద్యోగాలు లభించాయి. లోకాయుక్తను ఆశ్రయించినా ఉన్నతాధికారులు వాస్తవాలను కప్పిపుచ్చుతున్నారు. ఇప్పటికీ మభ్యపెట్టే పనిలోనే నిమగ్నమయ్యారని పలువురు అర్హులు వాపోతున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలెక్టర్ నేతృత్వంలో డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ ద్వారా పారా మెడికల్ రిక్రూట్‌మెంట్ ఉండేది. కలెక్టర్ నేతృత్వంలో రిక్రూట్‌మెంట్ ఉన్నంత కాలం అభ్యర్థుల సర్టిఫికెట్లు క్రమం తప్పకుండా వెరిఫికేషన్ ఉండేది. తద్వారా బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందాలని అనుకునే వారు వెనక్కి తగ్గేవారు. కాగా 2002లో అప్పటి చంద్రబాబు సర్కారు రాష్ట్ర వ్యాప్తంగా పారా మెడికల్ రిక్రూట్‌మెంట్ చేపట్టింది. రాతపరీక్ష నిర్వహించి సెలెక్షన్ చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణ సంస్థలో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) ట్రెనింగ్ కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 10 కళాశాలలకు మాత్రమే పారా మెడికల్ బోర్డు అనుమతి ఉంది. వాటిలో సర్టిఫికెట్లు జారీ పొందిన వారంతా అర్హులు. రాష్ట్ర వ్యాప్తంగా సెలెక్షన్ చేపట్టడంతో ఇబ్బడి ముబ్బడిగా ఎలాంటి అనుమతులు లేని ప్రైవేటు కళాశాలల నుంచి సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. విద్యా సంవత్సరంతో నిమిత్తం లేకుండా ప్రతి నెలా సర్టిఫికెట్లు జారీ చేసిన ఉదంతాలు వెలుగు చూశాయి. ఇలా ఆల్‌ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ముంబయి/కర్ణాటక.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ హైజిన్, న్యూఢిల్లీ.. బెతాస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, శానిటేషన్ టెక్నాలజీ, విశాఖపట్నం.. ది కాలేజీ ఆఫ్ మెడికల్ టెక్నాలజీ, ఒంగోలు నుంచి ఇబ్బడి ముబ్బడిగా మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) ట్రెనింగ్ కోర్సు పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు లభించాయి. గుర్తింపు పొందిన కళాశాలల జాబితాలో పైన పేర్కొన్న కళాశాలలు లేకపోవడం గమనార్హం.



కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (ఇన్‌సెట్) ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణ సంస్థల జాబితా

అర్హులకు అవకాశం కల్పించాలని..

గుర్తింపు పొందిన కళాశాలల నుంచి మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) ట్రెనింగ్ కోర్సు పూర్తి చేసిన తమకు ఉద్యోగాలు కల్పించాలని అనేక మంది 20 ఏళ్లుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల మంది అనర్హులు రెగ్యులర్ ఉద్యోగం చేస్తున్నారు. అర్హులమైన తమకు ఉద్యోగాలు దక్కలేదని అర్హులు వాపోయారు. ఈ పరిస్థితుల్లో అర్హులైన వారిని కాంట్రాక్టు బేసిస్ పైన నియామకం చేపట్టారు. వాస్తవ పరిస్థితులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుకు వివరించడంతో స్పందించిన అప్పటి సీఎం వైఎస్ జగన్ ఇలా కాంట్రాక్టు బేసిస్‌పై పని చేస్తున్న సుమారు 100 మందిని రెగ్యులర్ చేయాలని ఆదేశించారు. అధికారులు సత్వర చర్యలు తీసుకోవడంలో విఫలం కావడంతో మళ్లీ వీరి సమస్య మొదటికి వచ్చింది. బాధితులు కాంట్రాక్టు ఉద్యోగాలకే పరిమితం కావాల్సి వచ్చింది.

లోకాయుక్తను ఆశ్రయించిన బాధితులు

రెగ్యులర్ ఉద్యోగాల కోసం అనేక పోరాటాల తర్వాత బాధితులు లోకాయుక్తను ఆశ్రయించారు. ప్రభుత్వ గుర్తింపులేని నాలుగు ప్రైవేటు సంస్థల నుంచి సర్టిఫికెట్లు పొందిన వారి కారణంగా నష్టపోయామని వాపోయారు. సర్టిఫికెట్లు జారీ చేయడం కూడా విద్యా సంవత్సరంతో నిమిత్తం లేకుండా అన్ని నెలలు జారీ చేశారు. బోర్డు ఆఫ్ ఎగ్జామినర్‌తో నిమిత్తం లేకుండా సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. అన్ని ఆధారాలను బాధితులు లోకాయుక్తకు మొరపెట్టుకున్నారు. విచారణకు స్వీకరించిన లోకాయుక్త జూలై 30న హాజరు కావాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. అసంపూర్తి రికార్డులతో హాజరు కావడంతో ఈ నెల 25న హాజరు కావాలని మరోమారు లోకాయుక్త ఆదేశాలు జారీ చేసింది.

ఉద్దేశ పూర్వకంగా అన్యాయం

మల్టీ పర్పస్ హెల్త్ అసిసెంట్ (మేల్) రెగ్యులర్ ఉద్యోగాలు అనర్హులకు అనేక మందికి దక్కాయి. అర్హత ఉన్న మాకు రెగ్యులర్ ఉద్యోగాలు ఇవ్వాలని అనేక సార్లు కోరినా నిష్ప్రయోజనమే అవుతోంది. సర్వీసు రూల్స్‌ను సైతం తుంగలోకి తొక్కి దశాబ్దాల తరబడి ఉద్దేశ పూర్వకంగా అన్యాయం చేస్తున్నారు. కడప వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ పరిధిలో ఇలా 36 మంది ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 100 మంది అన్యాయానికి గురయ్యారు. బోగస్ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగు చూసే అవకాశం ఉందని, ఉన్నతాధికారులు మాకు అన్యాయం చేస్తున్నారు. లోకాయుక్తలో న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నాం.

– ముత్యాల బాలుడు, కాంట్రాక్ట్ ఉద్యోగి, వైద్య ఆరోగ్య శాఖ, కడప

అనర్హులకు అందలం.. అర్హులకు మొండిచేయి

దశాబ్దాలుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వ సంస్థల్లో శిక్షణ పొందిన అన్ని విధాలా అర్హులైన హెల్త్ అసిస్టెంట్లకు న్యాయం చేయకుండా, బోగస్ సర్టిఫికెట్లను ఏరివేయకుండా చట్టాలను ఉల్లంఘిస్తున్నారు. రెగ్యులర్ చేయడంలో అన్యాయం చేశారు. అనర్హులకు అందలం ఎక్కిస్తూ, అర్హులకు మొండిచేయి చూపుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల వింత వైఖరిపై సీఎం చంద్రబాబునాయుడు జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

– విశ్వనాథరెడ్డి, కాంట్రాక్ట్ ఉద్యోగి, వైద్య ఆరోగ్య శాఖ, కడప

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఇద్దరు విద్యార్థుల దుర్మరణం



మృతిచెందిన అజయ్‌కుమార్ రెడ్డి



మృతిచెందిన యశ్వంత్‌కుమార్‌రెడ్డి

కురబలకోట: కళాశాలకు వెళ్లి మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు డిగ్రీ విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. ఈ విషాదకర సంఘటన శుక్రవారం సాయంత్రం కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. తంబళ్లపల్లె మండలం మలిగివారిపల్లెకు చెందిన అజయ్‌కుమార్ రెడ్డి (20), అదే మండలం చెట్లవారిపల్లెకు చెందిన యశ్వంత్ కుమార్ రెడ్డి (20) మదనపల్లెలోని ఓ డిగ్రీ కళాశాలలో సెకండ్ ఇయర్ బీకాం కంప్యూటర్స్ చదువుతున్నారు. ఇద్దరూ స్నేహితులు. శుక్రవారం సాయంత్రం కళాశాల నుంచి తిరిగి ఇద్దరూ మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి బయలు దేరారు. మార్గమధ్యంలోని కురబలకోట మండలం దాదంవారిపల్లె సమీపంలోని మలుపు వద్ద తంబళ్లపల్లె నుంచి మదనపల్లెకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఒక్కరొక్కరే కుమారులు కావడం వారికి తీరని వేదనను కలిగిస్తోంది. యశ్వంత్ కుమార్ రెడ్డి తండ్రి ముందు భార్యకు ఇద్దరూ కుమార్తెలే. మొదటి భార్య అనుమతితో కుమారుడి కోసమే రెండో పెళ్లి చేసుకున్నారు. వీరికి పుట్టిన ఒక్క కుమారుడూ చనిపోవడంతో వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. మృత దేహాలను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు

వైస్ ఎంపీపీపై దాడికి యత్నం

- కురబలకోటలో టీడీపీ నేతల అరాచకం
- ఆయనతో పాటు పలువురు ఎంపీటీసీలు మండల సమావేశానికి వెళ్లకుండా అడ్డగింత
- వైఎస్సార్‌సీపీ నిరసన.. రోడ్డుపై బైఠాయింపు
- భారీగా పోలీసుల మోహరింపు



కురబలకోటలో ఎన్వీ రమణారెడ్డిని అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు



కురబలకోట మండల మీట్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు

కురబలకోట: కురబలకోట మండల వైస్ ఎంపీపీ, మట్లివారిపల్లె ఎంపీటీసీ సభ్యుడు ఎన్వీ రమణారెడ్డిపై టీడీపీ శ్రేణులు శుక్రవారం మూకుమ్మడిగా దాడికి యత్నించి దౌర్జన్యానికి తెగబడ్డారు. ఆయన మండల సమావేశానికి వెళ్లకుండా మండల పరిషత్ కార్యాలయ గేటు బయటే అడ్డుకున్నారు. దీంతో రమణారెడ్డి రోడ్డుపైనే బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. వివరాలిలా ఉన్నాయి.. కురబలకోట మండల సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యులకు సర్క్యులర్లు పంపిన నేపథ్యంలో.. ఉ.11 గంటలకు మండల వైస్ ఎంపీపీ ఎన్వీ రమణారెడ్డి మండల పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చారు. అప్పటికే కార్యాలయం బయట వేచి వున్న టీడీపీ శ్రేణులు ఆయన రాగానే అడ్డుకున్నారు. కోర్టు ఆర్డరు ఉన్నా కూడా ఎందుకు వెళ్లకూడదని రమణారెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచి వస్తే లోపలికి పంపుతామని చెబుతూ రమణారెడ్డిని వెనక్కి తోస్తూ దాడికి యత్నించారు. వీరి దౌర్జన్యాన్ని నిరసిస్తూ రమణారెడ్డి రోడ్డుపైనే బైఠాయించారు. ఇలాంటి దౌర్జన్యాలకు భయపడబోనని మండిపడ్డారు. ఆ తర్వాత అక్కడికి ఎర్రబల్లె వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ రవీంద్రరెడ్డి, అంగళ్లు ఎంపీటీసీ మొలక త్రివేణి చేరుకోగా వారిని కూడా టీడీపీ వారు అడ్డుకున్నారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో పోలీసులు భారీగా మోహరించారు. త్రివేణి వెనుదిరిగి వెళ్లిపోయారు. పిచ్చలవాండ్లపల్లె ఎంపీటీసీ గోపాలకృష్ణ ఇక్కడి పరిస్థితి చూసి సమావేశానికి వెళ్లకుండా బయటే ఉండిపోయారు. ఇక నందిరెడ్డిగారిపల్లె వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు, మండల వైస్ రెండో ఎంపీపీ ఎంజి భూదేవి ఒక్కరే మండల సమావేశానికి హాజరయ్యారు. అలాగే, కురబలకోట సర్పంచ్ సుక్కా సుజాతతో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు. కోరంలేని కారణంగా మండల మీట్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ గంగయ్య ప్రకటించారు.



టీడీపీ శ్రేణులు అడ్డుకోవడంతో వెనుతిరిగి వెళ్లిపోతున్న ఎంపీటీసీ త్రివేణి

కందకం.. ప్రయోజనం

- ఉపాధి హామీలో కొత్త పథకం
- మామిడి తోటల్లో వృత్తాకార కందకాల ఏర్పాటు
- ఒక చెట్టుకు రూ. 1525
- ఎకరం మామిడి రైతుకు రూ. 1,06,750 ఆదాయం
- మంచి ఫలితాలు ఇస్తున్న కందకాల ఏర్పాటు
- వర్షాలు కురుస్తున్నందున ఇదే సరైన సమయం

గుర్రంకొండ: ఉపాధి హామీలో కొత్త పథకం ఇప్పుడిప్పుడే రైతుల దరి చేరుతోంది. మామిడి తోటల్లోని మామిడి చెట్లకు వృత్తాకార లేదా చతురస్రాకార కందాలను ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్నారు. ఈ పథకం అమలుకు ఇదే సరైన సమయం. ఒక చెట్టుకు ప్రభుత్వం రూ.1525 వరకు చెల్లిస్తోంది. ఎకరం మామిడి తోటలు ఉన్న రైతుకు గరిష్టంగా రూ.1,06,750 వరకు ఆదాయం సమకూరుతోంది. వృత్తాకార కందకాల ద్వారా మామిడి చెట్లు మంచి పోషకాలతో కూడిన అభివృద్ధి సాధిస్తాయి. ఈపథకం గురించి జిల్లాలో ఇప్పుడిప్పుడే రైతులకు అవగాహన కల్పిస్తుండడంతో మంచి ఫలితాలు సాధిస్తోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మామిడి తోటల్లో ఈ పథకం వినియోగించుకొంటే మంచి ఫలితాలను రైతులు పొందవచ్చు.

జిల్లాలో 7632 ఎకరాల్లో ప్రారంభమైన పథకం:

అన్నమయ్య జిల్లాలో మొత్తం 18,331 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. వృత్తాకార లేదా చతురస్రాకార కందకాలు ఏర్పాటు పథకం ప్రస్తుతం 7632 ఎకరాల్లో ప్రారంభమైంది. అన్ని నియోజకవర్గాల్లోని మామిడితోటల్లో రింగ్ ట్రంచ్‌లు (వృత్తాకార కందకాలు) ఏర్పాటు ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్నారు. రైతులు ఇప్పుడిప్పుడే ఈపథకం అమలకు మొగ్గు చూపుతున్నారు.

రైతుకు ఎకరానికి రూ.1,06,750 ఆదా:

ఉపాధి పథకం ద్వారా మామిడితోటల్లో వృత్తాకార కందకాలు ఏర్పాటు చేసే పథకంతో మామిడిరైతుకు ఎకరానికి రూ. 1.06,750 ఆదా అవుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరానికి 70 మామిడి చెట్లు పెంచాల్సి ఉంటుంది. ఒక్కో చెట్టుకు ప్రభుత్వం ఒక క్యూబిక్ మీటరుకు రూ: 305 చొప్పున ఐదు క్యూబిక్ మీటర్ల మేరకు రూ.1525 రైతుకు చెల్లిస్తుంది. ఈలెక్కన ఎకరానికి ఎంతలేదన్నా రూ.1,06,750 ఆదాయం రైతులకు వస్తోంది.

ఒక మొక్కకు 5 క్యూబిక్ మీటర్లు: ఉపాధి పథకంలో ఒక మామిడి మొక్కకు ప్రభుత్వ నిబంధనల మేరకు 5 క్యూబిక్ మీటర్ల మేరకు పనిచేసిన కొలతలు తీసి డబ్బులు చెల్లిస్తారు. ఒక మామిడి చెట్టుకు చుట్టూరా నిబంధనల మేరకు ఒక మీటరు పొడవు/వెడల్పు/ లోతు మట్టిని తీయాల్సి ఉంటుంది. మామిడి మొక్క ఎదుగుదల వెడల్పును బట్టి కొలతలు మార్చుకోవచ్చు. ఒకమీటరు నుంచి రెండు మీటర్ల మేరకు పొడవు/వెడల్పు/ దానికి తగ్గట్టుకు అర్థ అడుగుమేరకు లోతుతో కందకాలు తవ్వుకోవచ్చు. ఎలా పనిచేసినా నాలుగు నుంచి ఐదు క్యూబిక్ మీటర్ల మేరకు కూలీలకు డబ్బులు చెల్లిస్తారు.

మూడునెలల పాటు కందకాలు ఏర్పాటు:

మామిడి తోటల్లో రింగ్‌ట్రెంచ్‌లను రానున్న మూడునెలలు ఎంతో అనుకూలమని అని రైతులు అంటున్నారు. మామిడి కాయలు కోసిన తరువాత పూతపట్టిసమయంకు మధ్యలో ఈసీజనే కందకాల ఏర్పాటుకు మంచి అదనుగా ఉంటుంది. , అక్టోబర్,నవంబర్, డిసెంబర్‌నెలలో ఈ పథకం సద్వినియోగం చేసుకోవడం వలన చెట్టుకు పూత ఏర్పడేందుకు ఎటువంటి ఆటంకాలు ఉండవు.

వర్షాలు కురుస్తున్నందున సరైన సమయం:

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం విస్తార ంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు మామిడితోటల్లో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఈపథకం అమలుకు ఇదే సరైన సమయం అని అధికారులు అంటున్నారు. తోటల్లో కందకాలు తవ్వేందకు కూడా ఎక్కువ కష్టం ఉండదు. తేమ ఎక్కువగా ఉండడంతో పనులు వేగంగా జరుగుతాయి. తద్వారా ఈసీజన్‌లో కురిసే వర్షాలకు కందకాల్లో వర్షపు నీరు నిలిచి మామిడి చెట్లకు పోషకాలు, సత్తువ వచ్చే అవకాశముంటుంది.



మామిడితోటల్లో రింగ్‌ట్రెంచ్ పనులు చేస్తున్న కూలీలు



రింగ్ ట్రెంచ్‌ల ఏర్పాటుతో మామిడిచెట్టు మొదలు బలంగా కనిపిస్తున్న దృశ్యం

జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో ఉన్న మామిడి తోటల వివరాలు

నియోజకవర్గం	మామిడి తోటలు (ఎకరాలు)
పీలేరు	3125
మదనపల్లె	2768
తంబళ్లపల్లె	3154
రాయచోటి	3385
రాజంపేట	2963
రైల్వేకోడూరు	2936
మొత్తం	18,331

వర్షపు నీటి నిల్వతో మంచి పోషకాలు

వృత్తాకార కందకాలు (రింగ్‌ట్రెంచ్)లను మామిడి చెట్లకు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపునీటి నిల్వలతో చెట్టుకు మంచి పోషకాలు లభిస్తాయి. కందకాలు లేకపోతే చెట్టు దగ్గర వర్షపునీరు నిలిచే పరిస్థితి ఉండదు. రింగ్ ట్రెంచ్‌ల ఏర్పాటుతో వర్షపునీరు మొత్తం కందకాల్లో చేరి నిండిపోతుంది. దీంతోపాటుగా కుళ్లిన ఎరువులు కందకాల్లో చేరుతాయి. నీటి వసతితోపాటు ఎరువులు సమృద్ధిగా మామిడి చెట్టుకు లభిస్తాయి. తద్వారా మామిడి చెట్టు ఎటువంటి రసాయనిక ఎరువులు వినియోగించకుండానే సేంద్రియ ఎరువులతో మంచి ఎదుగుదల చెందుతుంది. దీనికి తోడు మామిడి మొక్క మొదట్లోపెద్ద ఎత్తున మట్టి వేయడం వలన చెట్టు తుఫాను, ఈదురు గాలుల నుంచి తట్టుకొని నిలబడే శక్తి చెట్టుకు వస్తుంది.

స్వంతంగా చేసుకొంటే ఎంతోమేలు



మామిడి తోటల్లో కందకాలు ఏర్పాటు చేసుకోవడం తోటల రైతులే చేసుకొంటే ఎంతో మేలు జరుగుతుంది. ఈ పథకం ద్వారా పనులు చేయడానికి రైతుకు ఎటువంటి ఖర్చు ఉండదు. రైతులకే ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉంటే వారు స్వయంగా ఈ పనులు చేసుకోవచ్చు. తద్వారా ఎకరానికి రూ.1,06,750 ఆదాయం అదనంగా సమకూరుతుంది.

– నాగన్న, మామిడిరైతు, కొత్తపల్లె

రోజువారీ కూలీ రూ.305 గిట్టుబాటు అవుతోంది



మామిడితోటల్లో రింగ్ ట్రంచ్‌లు తవ్వకాల పనులు బాగా గిట్టుబాటు అవుతున్నాయి. ప్రతి రోజూ రోజువారీ కూలీ రూ. 305 వరకు గిట్టుబాటు అవు తుంది. మామిడి తోటల్లో చెట్లకింద నీడ పొద్దున పనులు చేయడం వలన పెద్దగా అలసట ఉండదు.

– రమణ, ఉపాధిహామీ కూలీ, క్రిష్టాపురం

వర్షాలు కురుస్తున్నందున సద్వినియోగం అవుతుంది



మామిడి మొక్కలకు రింగ్‌ట్రెంచ్‌లు ఏర్పాటు చేసుకొనే పథకాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఈపథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకొంటే మంచి ఫలితాలు ఉంటాయి.

– జయరామిరెడ్డి, ఏపీవో, గుర్రంకొండ

క్లుప్తంగా

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

రామసముద్రం : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన రామసముద్రం మండలం మినికి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం కోలార్ సమీపంలోని ముదిగుబ్బకు చెందిన సుబ్రమణ్యం ఓవర్ స్పీడ్‌గా వస్తూ ఎదురుగా వస్తున్న రామసముద్రంకు చెందిన గంగరాజు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో గంగరాజుకు తీవ్ర గాయాలు కాగా సుబ్రమణ్యంకు స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే 108లో ఇరువురిని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన శంకరప్ప

ములకలచెరువు : ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని సోంపాళ్యం పంచాయతీ గట్టుకిందపల్లెకు చెందిన శంకరప్ప(52) వ్యక్తిగత పనులపై ములకలచెరువుకు వచ్చాడు. పనులు ముగించుకొని ఇంకికి వచ్చే సమయంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బస్సు ఢీ కొట్టింది. సంఘటన స్థలంలోనే అతడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గాయత్రి మృత దేహాన్ని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణాలు

- నిబంధనలకు తిలోదకాలు
- దెబ్బతింటున్న భక్తుల మనోభావాలు, విద్యార్థుల లక్ష్యాలు
- అధికారులు మూయించినా కూటమి పైరవీలతో తెరుచుకొన్న వైనం



మూసిన వెంటనే గంట వ్యవధిలో తెరుచుకొన్న మద్యం దుకాణం



సాయిబాబా, విఘ్నేశ్వర ఆలయాలకు దగ్గరలోని మద్యం దుకాణం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలో మద్యం దుకాణాల టెండర్లు దక్కించుకొన్న వారు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఇబ్బడి ముబ్బడిగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. చట్టంలో ఉండే లొసుగులను ఆసరాగా చేసుకుని ఇష్టారాజ్యంగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. బడి, గుడి అనే తేడా లేకుండా దగ్గరలోనే దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దేవాలయాలు, కళాశాలల దగ్గర్లోనే ఏర్పాటు చేయడం వల్ల అటు భక్తుల మనోభావాలు, విద్యార్థుల లక్ష్యాలు దెబ్బతింటున్నట్లు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రైల్వేస్టేషన్ రోడ్డులో 49 తిమల వైన్స్ విద్యాసంస్థలకు దగ్గరగా ఏర్పాటు చేశారు. కొన్ని ఫిర్యాదులు, నిరసనలు రావడంతో అధికారులు మూయించారు. గంటల వ్యవధిలోనే కూటమి నాయకుల పైరవీలతో మద్యం దుకాణాన్ని తెరుచుకొన్నారు. చిట్వేలి బైపాస్ రోడ్డులో బస్టాండ్ ఎదురుగా, సాయిబాబా ఆలయం, వినాయకుడి ఆలయాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేశారు.

నిబంధనలు గాలికి..

ప్రధాన జాతీయ రహదారికి అర కిలోమీటరు, పంచాయతీలలో 220 మీటర్లు, బడిగుడికి 100 మీటర్లు కొలతలు ఉండాలని అధికారులు చెబుతున్నారు. అయితే ఆలయాలకు సంబంధించి దేవదాయశాఖ పరిధిలోకి ఉండే ఆలయాలకు మాత్రమే చట్టం వర్తిస్తుందని చెప్పడం కొసమెరుపు. అలాగే ఆర్గనైజ్‌డ్ పాఠశాలలకు మాత్రమే వర్తింస్తుందని అంటున్నారు.

కూటమి నాయకుల పైరవీలు, సిండికేట్ ప్రయత్నాలు

గత ప్రభుత్వం ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో రాజకీయ జోక్యం లేకుండా ఉండేది. కూటమ ప్రభుత్వంలో మద్యం పాలసీ మార్చి ప్రైవేటు మద్యం రావడంతో పైరవీలు, సిండికేట్ ప్రయత్నాలు ఎక్కువయ్యాయి. ప్రతి నిత్యం ఆలయానికి భక్తులు వస్తుంటారు. మద్యం దుకాణం ఏర్పాటుదారులకు రాజకీయ పలుకుబడి ఉండటంతో ప్రజలు బయటకు చెప్పలేకపోతున్నారు. ఈ మధ్యకాలంలో కొందరు ఆందోళన చేసినప్పటికీ ఒక్కరోజులోనే అణిచి వేశారు. రాజకీయ నాయకుల జోక్యంతో సిండికేట్ కావడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

నివాసాల మధ్య తొలగించాలి



నివాసాలకు సమీపంలోని మద్యం దుకాణాలను తొలగించాలి. అలాగే బడి, గుడి అనే తేడా లేకుండా మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. దీని వల్ల మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. వీటిపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.

– మార్లె రాజేశ్వరి, మాజీ జెట్పీటీసీ, రైల్వేకోడూరు

మహిళలు ఇబ్బంది పడకుండా చూడాలి



పట్టణంలో, గ్రామాల సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల మహిళలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టి ఎవరికీ ఏ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

– పందుగోలు మణి, ఏపీ బికేఎంయూ జిల్లా అధ్యక్షుడు

ప్రొవిజన్ లైసెన్స్ వారం మాత్రమే..



వేలం దక్కించుకొన్న వారికి వారం రోజులు ప్రొవిజన్ లైసెన్స్ వారం రోజులు మాత్రమే ఇచ్చాం. వారం తరువాత అన్నీ సక్రమంగా ఉంటేనే వారికి రెండు సంవత్సరాల గడువు లైసెన్స్ ఇస్తాం. మద్యం దుకాణాల వల్ల ఎవరికైనా ఇబ్బందులు కలుగుతున్నాయని ఫిర్యాదులు వస్తే తప్పని సరిగా చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు లోబడి దుకాణాలు నిర్వహించాలి.

– తులసి, సీఐ, ఎక్సైంజ్ అండ్ ప్రొహిబిషన్‌శాఖ, రైల్వేకోడూరు

క్వారీని పరిశీలించిన ఎస్పీ

నందలూరు : మండలంలోని టంగుటూరు గ్రామ శివారులోని చెయ్యేరులో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ క్వారీ యజమానులతో మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున నదిలోకి వరదనీరు వచ్చే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలన్నారు.

అన్నపై తమ్ముడు దాడి

కలికిరి : వ్యవసాయబోరులో భాగ విషయమై అన్నపై తమ్ముడు దాడి చేసి గాయపరచిన ఘటన మండలంలోని అద్దవారిపల్లి గ్రామ పంచాయతీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అద్దవారిపల్లి గ్రామం గల్లావారిపల్లికి చెందిన అన్నదమ్ములు పెద్దరెడ్డెప్ప, చిన్నరెడ్డెప్ప వున్నారు. ఇద్దరి జాయింటు ఆస్తిలో వున్న బోరు వద్దకు పెద్దరెడ్డెప్ప వెళ్లగా బోరులో భాగము లేదని సోదరుడు చిన్నరెడ్డెప్ప కట్టెతో అన్నపై దాడి చేసి గాయపరచాడు. బాధితుడు కలికిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏఎస్‌ఐ మధుసూదనాచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటోను ఢీ కొన్న కారు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మృకుందాశ్రమం సమీపాన గురువారం రాత్రి ఆటోను కారు ఢీ కొట్టింది. పోలీసుల వివరాల మేరకు.. రాజంపేట వైపు నుంచి వస్తున్న కారు, కడప వైపు నుంచి వస్తున్న ఆటోను మృకుందాశ్రమం సమీపానికి రాగానే ఢీ కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గరికి గాయాలయ్యాయి. గాయాలైన వారంతా ఒంటిమిట్ట మండలంలోని రైల్వే కాలనీకి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు.వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసిన్నట్లు పోలీసులు తెలిపారు.

'గాజుల'ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

హ్యూమన్ రైట్స్ స్టూడెంట్ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపల్లి సాయికుమార్

రాయచోటి (జగదాంబసెంటర్) : పేద, మధ్య తరగతి మహిళలను టార్గెట్ చేస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషాను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని హ్యూమన్ రైట్స్ స్టూడెంట్ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపల్లి సాయికుమార్ డిమాండ్ చేశారు. రాయచోటిలో ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరని, పేద, మధ్య తరగతి ప్రజలకు భరోసానిచ్చే ప్రభుత్వమని పదేపదే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చెబుతున్నప్పటికీ కొంత మంది పార్టీని అడ్డంపెట్టుకుని మహిళలను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. వారికి లేనిపోని మాటలు చెప్పి ఆశలు పుట్టించి లొంగ తీసుకొని వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలు అడ్డుపెట్టుకొని ఇటువంటి దుర్మార్గ కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి పార్టీ ప్రతిష్టను, పార్టీపై ఉన్నటువంటి నమ్మకాన్ని ప్రజలు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రజల తరఫున కోరుతున్నామన్నారు. పోలీస్ అధికారులు కూడా గాజుల ఖాదర్‌బాషాపై సుమోటోగా కేసు నమోదు చేసి బుద్ధి చెప్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ధ్వంసమైన ఆలయం పరిశీలన

ములకలచెరువు : స్థానిక శ్రీ కనుగొండరాయస్వామి స్వామి ఆలయం సమీపంలో ద్వంసమైన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయాన్ని దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథం శుక్రవారం పరిశీలించారు. అనంతరం వేపూరికోటలో వెలసిన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆలయాన్ని ధ్వంసం చేసిన నిందితులను మూడురోజుల్లో పట్టుకొని రిమాండ్‌కు తరలించిన పోలీసులను అభినందించారు. మునుముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

రెండో భార్య వదిలి వెళ్లిందని ఆత్మహత్య

బి.కొత్తకోట : మండలంలోని బీరంగి గ్రామానికి చెందిన నాగరాజు (52) రెండవ భార్య వదిలి వెళ్లిపోయిందన్న మనస్థాపంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని కుమారుడు ఈశ్వరయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు. వాయల్పాడుకు చెందిన నాగరాజుకు గౌరమ్మ మొదటి భార్య కాగా ఆరుగురు సంతానం. ఈమె అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో నరసమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. ఈమెకు ఇద్దరు సంతానం. ఇటీవల నాగరాజు భార్య నరసమ్మతో కలిసి మండలంలోని బీరంగి గ్రామానికి వచ్చి జీవిస్తున్నాడు. ఈనెల 15న నరసమ్మ, నాగరాజు గొడవ పడటంతో అతడిని వదిలి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై మస్తాపానికి గురైన నాగరాజు నన్నేవరకు చూసుకుంటారని మధనపడ్డాడు. విషయం తెలిసిన బిడ్డలు సముదాయించి తమ వద్ద ఉండాలని కోరారు. దీనికి అంగీకరించని నాగరాజు గ్రామంలోని అటవీప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ బొజ్జినాయక్ తెలిపారు.

పెట్రోల్ బంక్ మోసాలపై చర్యలు తీసుకోండి



నిరసన తెలుపుతున్న బీకేఎంయూ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులోని సిద్దేశ్వర హాల్ ఎదురుగా ఉన్న నయారా పెట్రోల్ బంక్ యాజమాన్యంపై, వారి మోసాలపై తక్షణం కేసులు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేయాలని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి శుక్రవారం డిమాండ్ చేశారు. పెట్రోల్‌లో నీరు కలిపి వాహనాలకు అందించడం వలన సుమారు 70 వాహనాలు సీజ్ అయ్యాయని వారు పేర్కొన్నారు. వందలాది బండ్లు సీజ్ అయి ఆగిపోతున్నాయని బాధితులు గోడుపోట్టుకుంటున్నా యాజమాన్యం స్పందించకపోవడం వారి అవినీతికి నిదర్శనమన్నారు. రెవెన్యూ అధికారులు, సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోకుంటే వాహనదారులతో కలిసి రాస్తా రోకోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, రమణయ్య, వెంకటేష్, నరసింహులు, సుబ్బరాజు, చెంగయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ కేసులో నిందితులకు జైలుశిక్ష

గుర్రంకొండ : ద్విచక్రవాహనం చోరీ కేసులో ఇద్దరు నిందితులకు వాయల్పాడు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురుఅరవింద్ 15నెలల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ మధురామచంద్రుడు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సరిమడుగు పంచాయతీ పుల్లావాండ్లపల్లెకు చెందిన రమేష్ ఇంట్లో గత ఏడాది జూన్‌నలో ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఈ సంఘటనపై 2023 జూన్ 27 తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు. అప్పట్లో బి.కొత్తకోటకు చెందిన పోలీసులు గుర్రంకొండ మండలం చెర్లోపల్లెకు చెందిన చెన్నూరి ప్రకాష్(20), నెల్లూరు జిల్లా నవాబ్‌పేటకు చెందిన జి. సుబ్బారెడ్డి(31) అనే ఇద్దరు ద్విచక్రవాహనాల చోరీ చేసే ముఠాసభ్యుల్ని అదుపులోకి తీసుకొని విచారించారు. సదరు విచారణలో గుర్రంకొండలో రమేష్ ఇంట్లో ద్విచక్రవాహం చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించారు. నేరం రుజువు కావడంతో జూనియర్ సివిల్ జడ్జి నిందితులకు 15నెలల జైలుశిక్షతో పాటు రు.1000 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం

ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : విధి నిర్వహణలో అమరులైన పోలీస్ కుటంబ సభులను అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు అన్నారు. శుక్రవారం రాయచోటిలోని ఎస్పీ కార్యాలయంలో అశువులు బాసిన పోలీసు కుటుంబ సభ్యులతో ఎస్పీ ప్రత్యేక సమావేశమయ్యారు. విధి నిర్వహణలో అమరవీరులైన పోలీసుల సేవలను గుర్తించుకుంటామని, వారు చేసిన త్యాగాలు, సేవలే పోలీస్ శాఖను ఉన్నత స్థానంలో నిలిపాయని ఎస్పీ అభిప్రాయ పడ్డారు. వారి కుటుంబ సమస్యలు, వ్యక్తిగత, ఇతర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వారికి భరోసా ఇచ్చారు. ముఖ్యంగా విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ సిబ్బంది సంక్షేమంకోసం జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సౌకర్యాలు, కుటుంబ స్థితిగతులు, బాగోగులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి తమకు తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ బి చిన్నికృష్ణ, ఏఓ కృష్ణుడు, ఆర్ఐలు విజే రామకృష్ణ, ఎంటీఓ ఎం పెద్దయ్య, విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రీవియన్స్ డే...

పోలీసు, హోంగార్డు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లావివిధ పోలీస్ స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, హోంగార్డులు సిబ్బంది, వ్యక్తిగత స్పౌస్ చిల్డ్రన్స్, మెడికల్ సమస్యలు గురించి ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి ఎస్పీ భరోసా కల్పించారు.

టీడీపీ నేత భూ కబ్జా

- అధికారులను భయపెట్టి నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్
- తనకు న్యాయం చేయాలంటూ కలెక్టర్ వద్ద బాధితుడి వేడుకోలు



కబ్జాకు గురైన భూమి

పుల్లంపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నేతల అక్రమాలకు అంతులేకుండా పోయిందని, తన భూమిని వారి పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నందున తనకు న్యాయం చేయాలంటూ బాధిత రైతు కలెక్టర్‌ను ఆశ్రయించిన ఘటన అన్నమయ్య జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పుల్లంపేట మండల పరిధిలోని తిప్పాయపల్లి పంచాయతీలోని 621 సర్వే నంబరులోని 4 ఎకరాల 32 సెంట్ల భూమికి సంబంధించి గతంలో సయ్యద్ షామీర్‌కు డీకేటీ పట్టాను ప్రభుత్వం అందజేసింది. ఇందుకు సంబంధించి 1బీ, అడంగల్‌ను కూడా అతనికిచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఇదే భూమి మీద బావికాడపల్లి ఎగువపల్లికి చెందిన మాజీ ఎంపీపీ భర్త టీడీపీ నాయకుడి కన్ను పడింది. ఇంకేముంది అధికారులను బెదిరించి.. భూమికి సంబంధించిన 621 సర్వే నంబర్‌ను 621-ఏగా మార్చి అందులో ఉన్న 4 ఎకరాల 32 సెంట్లను తన బంధువులిద్దరి పేరుమీద టీడీపీ నేత ఆన్‌లైన్ చేయించారు. ఒకరి పేరు మీద 2 ఎకరాల 16 సెంట్లు , వేరొకరి పేరు మీద 2 ఎకరాల16 సెంట్లుగా చూపుతూ 1బీ, అనువంశిక ధ్రువీకరణ పత్రం పొందారు. వెంటనే రాజంపేటలో వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తనకు న్యాయం చేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయానికి షామీర్ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయింది. తన కుటుంబానికి ఆధారంగా ఉన్న ఆ పొలం తన సొంతం చేయాలని కలెక్టర్‌ను వేడుకుంటున్నాడు.

రైతు బజార్ ఏర్పాటు పనుల పరిశీలన

మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు



రైతుబజార్ స్టాళ్లను పరిశీలిస్తున్న మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, హార్టికల్చర్ ఆఫీసర్ ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి

మదనపల్లె : పట్టణంలోని సంతగేటు సమీపంలో రైతుబజార్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశాల మేరకు ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు పనులు పూర్తిచేశామని మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక హార్టికల్చర్ ఆఫీసర్ ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డితో కలిసి ఆయన రైతుబజార్‌లో జరిగిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ త్యాగరాజు మాట్లాడుతూ... నియోజకవర్గంలోని రైతులు తాము పండించిన ఉత్పత్తులను నేరుగా రైతుబజార్‌కు తీసుకువచ్చి ఎటువంటి కమీషన్లు, గేటు చెల్లించనవసరం లేకుండా స్వేచ్ఛగా అమ్ముకోవచ్చన్నారు. రైతులకు, వినియోగదారులకు మధ్య మాత్రమే వ్యాపార లావాదేవీలు జరుగుతాయని, దళారుల ప్రమేయం ఉండదన్నారు. రైతుబజార్‌లో ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, పాలు, ఇతర ఉత్పత్తులు అమ్ముకోదలచిన రైతులు తమ ఆధార్, పాసుపుస్తకం జిరాక్స్, రెండు కలర్ పాస్‌పోర్ట్ ఫొటోలు, ఒక ఫ్యామిలీ ఫొటో తీసుకువచ్చి వారి వారి గ్రామాల్లోని రైతుసేవాకేంద్రం లేదా నేరుగా రైతుబజార్, మదనపల్లెలో కానీ అందజేయాలన్నారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు రైతుబజార్‌లో కల్పించామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలుజారి రైలుకింద పడి మహిళ మృతి



మృతిచెందిన సుజాత

కొండాపురం : మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో తిరుపతి హుబ్లీ ప్యాసింజర్ రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తూ పులిచెర్ల సుజాత(36)శుక్రవారం మృతి చెందింది. ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించినట్లు హెడ్ కానిస్టేబుల్ పి. రాజారాంరెడ్డి తెలిపారు. వివరాలిలా.. చిలంకూరు గ్రామానికి చెందిన సుజాత కొండాపురం రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్ రైలు ఎక్కుతూ కాలు జారి రైలుకిందపడి అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలికి వివాహమై భర్తకు దూరంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని దుబ్బిగానిపల్లె పంచాయతీ ఎనుములవారిపల్లెకు చెందిన యువతి(19) సెప్టెంబర్ 29న ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయిందన్నారు. అప్పటి నుంచీ యువతి తల్లిదండ్రులు, బంధువులు తెలిసినవారి ఇళ్లలో, పలుప్రాంతాల్లో ఆచూకీ కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో గురువారం రాత్రి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రికల్ షాపు దగ్ధం



ఎలక్ట్రికల్ షాపులో కాలిపోయిన వస్తువులను చూపుతున్న యజమానులు

రాయచోటి టౌన్: పట్టణంలోని ఠాణా సర్కిల్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రికల్ షాప్ దగ్ధం అయ్యింది. ఫైర్ స్టేషన్ ఆఫీసర్ వెంకట్రామిరెడ్డి కథనం మేరకు.. ఠాణా సర్కిల్ వద్ద అంజంతా ఎలక్ట్రికల్ షాపు యజమాని శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ కోసం షటర్ మూసివేసి వెళ్లాడు. తరువాత వచ్చి షాపు షట్టర్ తెరిచి చూసే సమయానికి షాపు లోపల దట్టమైన పొగతో పాటుని వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వెంటనే సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లి మంటలు ఆర్పి అదుపులోకి తీసుకొచ్చామని చెప్పారు. సుమారు రూ.40 లక్షలకు పైబడి నష్టం జరిగి ఉంటుందని షాపు యజమాని చెప్పారు.

పది మందిపై కేసు నమోదు

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి అత్యవసర విభాగంలో అక్టోబర్ 16న ఇరువర్గాలు గొడవ పడిన ఘటనలో పదిమందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. గాంధీపురానికి చెందిన ఇరువర్గాలు గొడవపడి 16వ తేదీ బుధవారం రాత్రి చికిత్సల కోసం ఆస్పత్రికి వచ్చారన్నారు. అయితే, అక్కడ మరోసారి ఇరువర్గాలు గొడవపడి ఆస్పత్రి సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారు. అత్యవసర విభాగంలోని రోగులకు ఇబ్బంది కలిగించారు. అంతేకాకుండా అవుట్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న టూటౌన్ కానిస్టేబుల్ భాస్కర్‌నాయక్, ఆస్పత్రి సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు. ఈ విషయమై అవుట్‌పోస్ట్ కానిస్టేబుల్ భాస్కర్‌నాయక్ ఫిర్యాదుమేరకు ఇరువర్గాలలోని పునీత్, రేణుక, రమణమ్మ, రవి, శశి, సంధ్య, శివమ్మ, నాగమణి, అరుణ్, గంగులమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కురబలకోట వద్ద చింతపండు వ్యాపారి హత్య



హత్యకు గురైన ఖాదర్‌బాషా

కురబలకోట : మండల కేంద్రం కురబలకోట డంపింగ్ యార్డు వద్ద శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. కురబలకోటకు చెందిన ఖాదర్‌బాషా (26)గా గుర్తించారు. ఇతను చింతపండు వ్యాపారి అని గ్రామస్థులు చెబుతున్నారు. ముదివేడు పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. జాగిలాలను రప్పిస్తున్నట్లు తెలిపారు. హత్యకు గల కారణం ఏమిటన్నది విచారణలో తేలాల్సి ఉంది. రాజకీయాలకు సంబంధం లేదని చెబుతున్నారు. అక్రమ సంబంధం కారణంగా ఈ సంఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. రూరల్ సీఐ రమేష్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్ కుమార్ తెలిపారు.